బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# ఆసరాగా తొలుసూరు కొడుకు

ఒకప్పుడు వ్యక్తిగత సమస్యగా ఉన్న వృద్ధుల సంక్షేమం ఇప్పుడు సమాజ, ప్రభుత్వ బాధ్యతగా మారింది. వారికి ఆర్థిక భరోసా అవసరమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం బాధ్యతగా వారికి ఆసరా పింఛన్లు అందిస్తున్నది. వారి ఆరోగ్యం కోసం బస్తీ, పల్లె దవాఖానల్లో తగిన వైద్య సౌకర్యాలను కల్పిస్తున్నది. ఈ కారణంగానే తొలుసూరు బిడ్డ కేసీఆర్ అండగా ఉన్నాడు కదా అన్న భరోసా చాలామంది వృద్ధుల్లో కనిపిస్తున్నది.



నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

వృద్ధాప్యాన్ని రెండో బాల్యం అంటారు. పెద్దవారిని కూడా చిన్నపిల్లల మాదిరిగానే చూసుకోవాల్సి ఉంటుంది. ఆహారం, ఆరోగ్యంతో పాటు అన్నింట్లోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతుండటం, ఉపాధి కోసం సంతానం దూర ప్రాంతాలకు వెళ్తుండటంతో అవసాన దశలో వారికి కష్టాలు ఎదురవుతున్నాయి. వారి సమస్యలను వివరిస్తూ ఎంతో సాహిత్యం వస్తున్నది. ఇవన్నీ సమాజంలోని వాస్తవాలకు అద్దం పడుతున్నాయి. విరివిగా వృద్ధాశ్రమాలను ఏర్పాటుచేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్‌రంగంలో ఏర్పాటయ్యే వృద్ధాశ్రమాల సంగతి సరే సరి. ఈ నేపథ్యంలోనే వృద్ధుల సమస్యలు ప్రత్యేకమైనవని, వాటిని పట్టించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్న భావనలు నెలకొన్నాయి.

తెలంగాణకు వస్తే ఈ విషయంలో కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరిస్తున్నది. సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నది. ఈ కారణంగానే తొలుసూరు బిడ్డ కేసీఆర్ అండగా ఉన్నాడు కదా అన్న భరోసా చాలా మంది వృద్ధుల్లో ఉన్నది. ఇంటికి పెద్దగా ఉంటూ ఆదుకుంటున్నాడు కదా అని ఎంతో మంది భావిస్తున్నారు. దీనంతటికీ మూలం ఆసరా పింఛన్లు, వృద్ధుల ఆరోగ్యంపై సర్కారు చూపుతున్న శ్రద్ధే. వయసు మళ్లిన తర్వాత వ్యక్తిగత అవసరాలు, కోరికలు తగ్గిపోతాయి. పిడికెడన్నం తింటే కడుపు నిండినట్టవుతుంది. ఏదో అంత నోట్లో వేసుకోవడం తప్పిస్తే పుష్టిగా మూడుపూటలా తిని అరాయించుకునే పరిస్థితి ఎక్కడిది? అయితే ఇంత అన్నం కూడా దొరకని అభాగ్యులు ఎందరో. ఇందుకు కారణాలు ఎన్నెన్నో. కొందరి పిల్లల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. ఏమీ వెనకేసుకోలేక కొందరు వృద్ధులు ఒకరిపైన ఆధారపడాల్సి వస్తున్నది. ఈ క్రమంలో మాటలు పడ్డవారు, అవమానాలకు గురైనవారు ఎందరో. చిన్న చిన్న అవసరాలకు కూడా చేయి చాపాల్సిన పరిస్థితి.

ఈ పరిస్థితి నుంచి వారిని బయట పడేయడానికి కేసీఆర్ సర్కారు ఆసరా పథకం అమలుచేస్తున్నది.

ప్రతి నెలా వృద్ధులకు రూ.2,016 పింఛన్ ఠంచన్‌గా అందిస్తున్నది. ఇది వారికి ఎంతో భరోసా ఇస్తున్నది. చేతిలో డబ్బులుంటే ఆ ధీమానే వేరు. ఏమైనా కొనుక్కోమని మనుమడో, మనుమరాలికో ఐదో, పదో ఇవ్వొచ్చు. తినాలనిపించినప్పుడు పండో, కాయో కొనుక్కోవచ్చు.

సొమ్ము లేక చిన్న కోరికలను కూడా చంపుకోవాల్సిన అవసరం లేదు. ముసలితనంలో కూడా ఆనందంగా గడపొచ్చు. ఇలాంటి చికాకులు తప్పినందునే కేసీఆర్ అంటే వృద్ధులకు అంత ప్రేమ. రాష్ట్రంలో సుమారుగా 15.82 లక్షల మంది వృద్ధులకు పింఛన్ అందుతున్నది. దరఖాస్తు విధానం కూడా సులభతరమైంది. ఎలాంటి రుసుములు చెల్లించకుండా మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం పింఛనులో కేంద్రం వాటా కేవలం రూ.200 మాత్రమే. మిగిలిన రూ.1,816 కేసీఆర్ సర్కారు ఇస్తున్నది.

ఎవరికి భారం కాకుండా జీవితం గడపాలన్నదే వృద్ధుల ప్రధాన కోరికగా ఉంటుంది. అయితే నిర్ణీత వ్యవధిలో బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయించుకోక తప్పదు. ఇవి చిన్నవిలా అనిపించినా కనిపించని ఖర్చులే. కొన్నిసార్లు అవి తలకుమించిన భారంలా మారుతాయి. కానీ పల్లె, బస్తీ దవాఖానల ఏర్పాటుతో ఆ సమస్య తీరినట్టే. అక్కడికివెళ్తే ఉచితంగానే ఈ పరీక్షలు చేస్తున్నారు. ప్రయాణ చార్జీలు తప్ప, ఇతరత్రా ఖర్చులు లేకపోవడం వృద్ధులకు పెద్ద ఊరట కలిగిస్తున్నది. దాదాపు 500 బస్తీ దవాఖానలు, సుమారు మూడు వేల పల్లె దవాఖానలతో పరిస్థితి మొత్తం మారిపోయింది. వృద్ధాప్యంలో కంటి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. ఇందుకోసం కంటి వెలుగు పథకాన్ని అమలుచేయడంతో ఈ సౌకర్యం కూడా ఉచితంగానే అందుతున్నది. జిల్లాకొక ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేయనుండటం వృద్ధులకు మరో మేలు కలిగించనున్నది. వీటికి అనుబంధంగా ఉన్న దవాఖానలో వృద్ధుల కోసం జిరియాట్రీషియన్లు ఉంటారు. ఇలా వృద్ధుల కోసం వైద్య నిపుణులను నియమించడం దేశంలోనే తొలిసారి అయ్యిండొచ్చు ఇది కూడా తెలంగాణ మాడల్‌లో భాగమయ్యే అవకాశం ఉన్నది.

వృద్ధాప్యంలో ఆసరాతో పాటు కొంత వ్యాపకం కూడా ఉండాలి. పల్లెటూళ్లలో అయితే పెరటి తోటల పెంపకమో, ఒకటి, రెండు గొర్రె పిల్లలను మేపడమో, కోళ్లను పెంచడమో ఏదో ఒక రీతిలో కాలక్షేపం జరగాలి. ఇందుకు ప్రభుత్వం సాయమే అవసరం లేకుండా సొంతంగానూ సమకూర్చుకోవచ్చు. వృద్ధులను ఆదుకొనే బాధ్యత ఒక్క ప్రభుత్వానిదే కాదు, ఆయా కుటుంబాలు, మొత్తం సమాజానిది కూడా. మలి వయసులో వారికి కావాల్సింది నాలుగు మాటలు, కొన్ని ముచ్చట్లు.

ఊరిలోని గుడో, రచ్చబండో ఇందుకు వేదికైతే శేష జీవితం ప్రశాంతంగా సాగిపోతుంది. వారు ఎవరి కీ భారం కారు. ఆ వయస్సులోనూ తమ వంతుగా ఏదో ఒక రీతిలో సమాజ ప్రగతికి దోహదపడగలరన్న నమ్మకం కలుగుతుంది. దాంతో సమాజానికి పునాది లాంటి కుటుంబ వ్యవస్థ బలపడుతుంది.



గోసుల మల్లికాయాదవ్

(వ్యాసకర్త: కన్వీనర్, ఫోరమ్ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్)

# విశ్లేషణాత్మక విమర్శకుడు

తెలుగు సాహిత్య ప్రపంచంలో విమర్శకులు, భాషా శాస్త్రవేత్తగా పేరుగాంచిన మేధావి చేకూరి రామారావు. 'చేరా'గా అందరికీ సుపరిచితులైన ఆయన తెలుగు వాక్యాన్ని విశ్లేషించడంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. కొత్త విమర్శ ధోరణిని ప్రవేశపెట్టారు.



నేడు చేకూరి రామారావు జయంతి

చేకూరి రామారావు ఖమ్మం జిల్లా మధిర తాలుకా ఇల్లందుపాడు గ్రామంలో 1934 అక్టోబర్ 1న జన్మించారు. తుమాటి దోణప్ప ప్రోత్సాహంతో భాషా శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ (ఎంఏ) పట్టా తీసుకున్నారు. 'తెలుగు భాషా పరివర్తన సిద్ధాంతం'పై పరిశోధన పట్టా పొందారు. నోమ్ చామ్‌స్కీ భాషా సిద్ధాంతాన్ని ఉపయోగించి తెలుగు వాక్యాన్ని విశ్లేషించి సాహిత్యానికి కొత్త మార్గాన్ని చూపారు. కొత్త విమర్శ ధోరణిని ప్రవేశపెట్టారు. చేరా రాసిన 'స్మృతి కిణాంకం' వ్యాస సంపుటికి 2002లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. తెలుగు వాక్యం, పద వర్ణ సహితం అంటూ తెలుగు వాక్య నిర్మాణంపై ఆయన చేసిన పరిశోధన అతి తక్కువ కాలంలోనే మన్ననలు పొంది వివిధ విశ్వవిద్యాలయాల పాఠ్యాంశమైంది. పోటీ పరీక్షలకు, ఉద్యోగార్థులకు ఎంతో ఉపయోగపడింది. తెలుగులో వెలుగులు అనే లోతైన పరిశీలన వ్యాసాల సంకలనం రచించి ఆచార్య నాయని కృష్ణకుమారికి అంకితం ఇచ్చారు. చేరా మాస్టారు 'సాహిత్య విమర్శ-పరామర్శ' పేరిట వివిధ కవుల ప్రక్రియలు, వాదాలు, విధానాలు, కవిత్వ ఉద్యమాలపై, 'చేరాతలు' రచించారు.

తెలుగు సాహిత్యానికి విశేషమైన సేవలు చేసి, ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న చేకూరి రామారావు 2014 జూలై 24న 70 ఏండ్ల వయసులో పరమపదించారు. ఆయన భౌతికంగా మనల్ని విడిచిపెట్టి వెళ్లినా, ఆయన సాహిత్యానికి చేసిన సేవలు ఆయనను కలకాలం బతికిస్తాయనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. అలాంటి సాహిత్య విమర్శకుడిని ఆయన జయంతి సందర్భంగా స్మరించుకోవడం భాషాభిమానుల కర్తవ్యమే కాదు, బాధ్యత కూడా.



యాడవరం చంద్రకాంత్‌గౌడ్
94417 62105



# జిగేల్‌మంటున్న తెలంగాణ

విద్యుత్తు రంగంలో స్వయం సమృద్ధి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతున్నది. సమాజంలో అత్యంత బలహీన వర్గాలను ఆదుకునేందుకు రైతుబంధు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, అమ్మ ఒడి (కేసీఆర్ కిట్), కల్యాణలక్ష్మి, కంటివెలుగు, వృద్ధాప్య పింఛన్లు, ధరణి పోర్టల్ వంటి ఎన్నో పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నది. తొమ్మిదేండ్ల పాలనలో తెలంగాణను అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టిన దార్శనికుడు, పాలనాదక్షుడు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు అరువై ఏండ్ల పాటు అభివృద్ధి కుంటుపడి తెలంగాణ అత్యంత దయనీయ స్థితిలో ఉండేది. సొంత రాష్ట్రం కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి, పోరాడి తెలంగాణను సాధించిన వీరుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. ఉద్యమకాలంలో తెలంగాణలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి, అక్కడి ప్రజల జీవన విధానాలను, వాళ్ల ఆర్థిక స్థితిగతులను, అర్థం చేసుకొన్నారు. తెలంగాణ సాధన తర్వాత గ్రామీణ ప్రాంతాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. అప్పట్లో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు సరిగా ఉండకపోయేది. ఎప్పుడో అర్ధరాత్రి ఏ రెండు గంటలకో కరెంటు వచ్చేది. ఆ రాత్రి రైతులు పొలాల దగ్గరికి వెళ్లి మోటర్లు వేసి, పంటకు నీళ్లు పారించేవాళ్లు. వ్యవసాయాన్నే నమ్ముకొని బతికే రైతులు కరెంటు లేక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. సమైక్య పాలనలో మన నీరు, మన బొగ్గును ఇతర ప్రాంతాలకు తరలించి విద్యుత్తు ప్రాజెక్టులను నిర్మించారు. దీంతో తెలంగాణలో డిమాండ్‌కు తగ్గ విద్యుదుత్పత్తి చేసే సబ్‌స్టేషన్లు, విద్యుత్తు లైన్ల నిర్మాణం జరగలేదు.


అరకొరగా, ఎప్పుడో కానీ ఒక గంట లేదా రెండు గంటలు వచ్చిపోయే కరెంటు మూలంగా మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవి. దీంతో పంటలు పండక గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉండేది. విద్యుత్ కోతలతో అటు పరిశ్రమలు మూతపడి ఎంతోమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. చాలా మంది నగరాలకు వలస వెళ్లారు.

ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన కాకతీయ విద్యుత్తు పవర్ స్టేషన్, లోయర్ జూరాల, పులిచింతల జల విద్యుత్తు కేంద్రాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసింది. కేటీపీఎస్ 7వ దశ 800 మెగావాట్ల క్రిటికల్ థర్మల్ స్టేషన్‌ను రికార్డు స్థాయిలో కేవలం 48 నెలల్లోనే పూర్తిచేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. అలాగే రూ.34,400 కోట్లతో నల్గొండ జిల్లా దామరచర్లలో యాదాద్రి విద్యుత్తు పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం చివరి నాటికి మొదటి ప్లాంట్‌లో ఉత్పత్తి మొదలవుతుంది. యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టు ద్వారా పది వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. అన్నిరంగాల్లో నిరంతర విద్యుత్తు సరఫరాకు అత్యంత ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్‌ను అభివృద్ధి చేసి, దేశంలోనే నాణ్యమైన విద్యుత్తు సరఫరా వ్యవస్థ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది.

ఇటువంటి వ్యవస్థ ఉండటం వల్ల ప్రస్తుతం అవసరం ఉన్న 15.497 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి డిమాండ్‌ను కూడా రాష్ట్రం తట్టుకుంటుంది. నేషనల్ పవర్ గ్రిడ్ లెక్కల ప్రకారం దేశంలో నాణ్యమైన విద్యుత్తు ఉత్పత్తి చేసే రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. ఈ విధంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమైన విద్యుత్తు రంగాన్ని తెలంగాణ ప్రభుత్వం పటిష్ఠపరిచింది. అభివృద్ధి చెందిన దేశాలు విద్య, వైద్యం విషయంలో ఎంత శ్రద్ధ వహిస్తాయో అలాగే తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ రంగాల అభివృద్ధి విషయంలో అంతే శ్రద్ధ వహించింది.

తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అద్భుతంగా అభివృద్ధి చెందింది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా ఐటీ ఎగుమతులు 36 శాతానికి పెరిగాయి. ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాలు 16 శాతం పెరిగాయి. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయం గా సీఎం కేసీఆర్ సమర్థవంతం గా పని చేస్తున్నారనడంలో సందేహం లేదు.

అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్తు రంగాన్ని తొమ్మిదేండ్ల పాలనలో ప్రగతి బాటలో పరుగులు తీయించారు ముఖ్యమంత్రి కేసీఆర్. రూ.97,321 కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను పటిష్టపరిచారు. విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని 7,778 మెగావాట్ల నుంచి 18,567 మెగావాట్లకు పెంచారు. థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని 5,156 మెగావాట్లకు, సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని 5,273 మెగావాట్లకు పెంచారు.



డాక్టర్ బీఎన్ రావు
98668 34717

(వ్యాసకర్త: సీనియర్ కన్సల్టెంట్, కరీంనగర్)

# 'సిఫారసుల అమలే' నివాళి

హరిత విప్లవం గుర్తుకురాగానే స్ఫురించే మొదటి పేరు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్. వ్యవసాయంలో ఆధునిక విధానాలను ప్రవేశపెట్టి దేశ ఆహార భద్రతను పెంచి దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి వెలకట్టలేనిది. రైతుల జీవితాలను మెరుగుపరచడానికి చివరిదాకా ఆయన పనిచేశారు.



భారత వ్యవసాయరంగంలో అనేక కీలక మలుపుల వెనుక ఆయన నిర్ణయాలు, ఆలోచనలు ఉన్నాయి. హరిత విప్లవం పేరుతో అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ వంగడాలు, రసాయనాలు, యంత్రాలు వాడటం ప్రారంభించింది ఆయనే. హరిత విప్లవానికి సహకారం అందించడానికి జాతీయస్థాయిలో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విస్తరణ వ్యవస్థ, వ్యవసాయ రుణాల కోసం బ్యాంకుల జాతీయీకరణ, మద్దతు ధరలు, ధాన్యసేకరణ కోసం భారతీయ ఆహార సంస్థ, ఆహార భద్రత కోసం జాతీయ పంపిణీ వ్యవస్థ వంటివి ఏర్పాటు చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా, అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్‌గా, కేంద వ్యవసాయ శాఖ కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం సభ్యులుగా, ఎంపీగా అనేక కీలక పదవులను ఆయన నిర్వహించారు. మొత్తం 33 జాతీయ అవార్డులు, 32 అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా దిగుబడులు ఎంత పెంచామని కాకుండా, రైతుల ఆదాయం ఎంత పెంచామని ఆలోచించాలని స్వామినాథన్ సూచించారు. ఎంపీగా ఉన్న సమయంలో వ్యవసాయరంగంలో మహిళల ప్రాధాన్యం గుర్తించి, దానికి అనుగుణంగా విధానాలు ఉండాలని మహిళా రైతుల హక్కుల చట్టం ముసాయిదా తయారుచేసి పార్లమెంట్ ముందుంచారు. గ్రామీణులు సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు వచ్చినప్పుడే వ్యవసాయంలో మార్పులు వస్తాయన్న ఆలోచనతో గ్రామాల్లో వాతావరణ పాఠశాలలు స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పుల ప్రభావం వ్యవసాయరంగం మీద ఎలా ఉంటుంది, ఆ మార్పులను ఎదుర్కోవడానికి రైతులు ఏం చేయాలి, ప్రభుత్వ విధానాలు ఎలా మారాలనే అంశాలపై పరిశోధన చేయడమే కాకుండా ఆ దిశగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారు.

వ్యవసాయరంగంలో ఉన్న విభిన్న పరిస్థితులు, విభిన్న అవసరాలు, విభిన్న దృక్కోణాల మధ్యలో నిర్ణయాలు తీసుకునే విషయంలో ఎదురయ్యే అనేక వివాదాలు కూడా ఆయన చుట్టూ ఉన్నాయి. హరిత విప్లవం ద్వారా వచ్చిన దుష్ఫలితాలకు ఆయనే బాధ్యులని, జాతీయ జీవవైవిధ్యం కోల్పోవటం, విదేశాలకు తరలిపోవటంలో ఆయన పాత్ర ఉందని అనేక ఆరోపణలు వచ్చాయి. కానీ ఆయన జీవన ప్రయాణాన్ని దగ్గరగా చూసినవాళ్లు కానీ, ఆయనతో ఒక్కసారి మాట్లాడిన వాళ్లు కానీ చెప్పే అనుభవాలు పూర్తిగా వేరుగా ఉన్నాయి. తనతో కలిసి పని చేసిన ప్రతి వ్యక్తి పేరు గుర్తుపెట్టుకొని పలకరించే అలవాటు ఆయనకు ఉండేది. జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా ఉన్నప్పుడు సంస్థ పొలంలో పనిచేసే రైతులను కూడా ఆయన పేరుతో పలకరించేవారని చెప్తారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడటం కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ప్రయత్నాల వెనుక స్వామినాథన్ సహకారం ఉన్నది. జీవవైవిధ్య చట్టం, బయో డైవర్సిటీ ఇంటర్నేషనల్, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ స్థాపనలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో గల ఇక్రిశాట్ ఏర్పాటు కూడా ఆయన ప్రయత్నాల వల్ల జరిగినదే. భారత దేశంలో ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్ణయాల మేరకు మేధో సంపత్తి హక్కుల గురించి చర్చలు జరిగి చట్టం చేసినప్పుడు, అందులో రైతులకు హక్కులు ఉండాలని పోరాడి, వాటిని కూడా చట్టంలో చేర్చేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు. భారతదేశంలో అనేక పాంతాల్లో రైతులు కాపాడుతూ వస్తున్న జీవవైవిధ్యాన్ని డాక్యుమెంట్ చేసి, దానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించే దిశగా స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా కృషి చేశారు.

వ్యవసాయ సమస్యలు, వాటి పరిష్కారాల గురించి ఆయన ఎన్నో వ్యాసాలు రాశారు. ప్రభుత్వాలు చెప్పిందే చేయటం కాకుండా, ప్రభుత్వాలు ఏం చేయాలో చెప్పి వారి చేత ఆ మార్పులు చేయించేవారు. 2004లో జాతీయ రైతుల కమిషన్ చైర్మన్‌గా ఉన్న ఆయన దేశ వ్యాప్తంగా పర్యటించి వ్యవసాయ రంగంలో తీసుకురావాల్సిన మార్పుల గురించి, రైతుల సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించారు.

పంటల పెట్టుబడి ఖర్చుకు అదనంగా 50 శాతం జత చేసి మద్దతు ధర కల్పించాలని, ప్రతి రాష్ట్రం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేయాలని, పంటల బీమా చేయాలని, ప్రతి మనిషికి ఆరోగ్య బీమా వర్తింపజేయాలని నివేదిక సమర్పించారు. కానీ ఆయన సిఫారసులు నేటి వరకు అమలు చేయకపోవడం దురదృష్టకరం. స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలుచేయడమే స్వామినాథన్‌కు నిజమైన నివాళి. ఆయన జీవితం ఎందరికో ప్రేరణ కలిగిచింది. వ్యవసాయరంగానికి స్ఫూర్తిగా నిలిచిన ఆయనకు రైతుల తరపున ఘన నివాళి.



పులి రాజు
99083 83567

(వ్యాసకర్త: సామాజిక కార్యకర్త)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే మన రాష్ట్రానికి చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులు, ప్రముఖుల గురించి తెలుసుకోవడం, బాహ్య ప్రపంచానికి వెల్లడవడం ప్రారంభమైంది. అలాంటి తెలంగాణ మట్టి బిడ్డల్లో ఒకరు, ఎత్తిపోతల రంగ నిష్ణాతులు, ఇంజినీర్ కె.పెంటారెడ్డి. ఈఎన్‌సీగా రిటైర్డ్ అయినప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన ప్రతిభను, కార్యదక్షతను గుర్తించారు. అందుకే ఎత్తిపోతల రంగ సలహాదారుగా నియమించారు.




# నీటి పారుదల రంగ ఆణిముత్యం

విద్యుత్ శాఖలో పెంటారెడ్డి సూపరింటెండెంట్ ఇంజినీరుగా పదవీ విరమణ చేశారు. పదవిలో ఉన్నప్పుడే ఉమ్మడి రాష్ట్రంలో ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకంలో పుట్టంగండి పంప్ హౌజ్ నిర్మాణం, పంపులను అమర్చడం తదితర పనులను విద్యుత్తు శాఖ తరపున పర్యవేక్షించారు. 18 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5 పంపులను ఈ పంప్‌హౌజ్‌లో అమర్చారు. వీటిని తయారుచేసింది బీహెచ్‌ఈఎల్. 100 మీటర్ల సింగిల్ లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తిపోసే ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో తెలంగాణలో భారీ ఎత్తిపోతలకు డిమాండ్ పెరిగింది. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రం చేపట్టిన అన్ని ఎత్తిపోతల పథకాల్లో కూడా పంపులు, మోటర్లను అమర్చడంలో పెంటారెడ్డి సహకారమందించారు. రిటైరైన తర్వాత పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రూపకల్పనలో పాలుపంచుకున్నారు. తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం తరపున ఈ పథకం అమలు కోసం జరిగిన భావప్రచారంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా తిరిగి ప్రచారం చేశాడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే సీఎం కేసీఆర్ పెంటారెడ్డిని సాగునీటి శాఖలో ఎత్తిపోతల సలహాదారుగా నియమించారు. ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్లనే పంప్‌హౌజ్‌లు ఇవ్వాళ్ల సమర్థవంతంగా పని చేస్తున్నాయి.

పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రిచే ప్రారంభింపచేసిన మోటర్‌తో కలిపి పెంటారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించిన మోటర్ల సంఖ్య మొత్తం 251. ఇన్ని భారీ పంపులను తిప్పిన ఇంజినీర్ దేశంలో మరొకరు లేరు. ఈ ఘనత సాధించిన పెంటారెడ్డి తెలంగాణ వాడు కావడం మనకు గర్వకారణం. తెలంగాణే కాదు, భారతదేశం గర్వించదగ్గ ఇంజినీర్ పెంటారెడ్డి. ఆయన సారథ్యంలో పాలమూరు ఎత్తిపోతల వంటి అనేక ప్రాజెక్టుల్లో పంపులు అమర్చారు. అంతేకాదు, ఐడీసీ వారి చిన్న ఎత్తిపోతల పథకాలను వందల సంఖ్యలో పునరుద్ధరించారు. ఈ పనుల కోసం వయసును లెక్క చేయకుండా నిరంతరాయంగా పర్యటిస్తూనే ఉన్నారు. కల్వకుర్తి పంప్‌హౌజ్ మునిగిపోతే ఒక నెలలో పునరుద్ధరిస్తామని ప్రకటించి ఆ పనిచేసి చూపించారు. కాళేశ్వరం పంపులను కూడా 3 నెలల్లో పునరుద్ధరించి చూపారు.

పంప్‌హౌజ్‌ల నిర్వహణ కోసం ఒక సమగ్రమైన ఆపరేషన్ మాన్యువల్‌ను తయారుచేశారు పెంటారెడ్డి. అనేక మంది యువ ఇంజినీర్లను తన వారసులు గా తీర్చిదిద్దారు. ఆయన మార్గనిర్దేశనంలో యువ ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీర్లు తర్ఫీదు పొంది పంప్‌హౌజ్‌లను నిర్వహిస్తున్నారు. తెలంగాణ సాగునీటి రంగ చరిత్రలో ఆయన సేవలు ఎల్లపటికీ నిలిచిపోతాయనటంలో సందేహం లేదు.



కె.వెంకట రమణ
98499 05900